
# రోడ్డుపక్క శవం

పి. చంద్రశేఖర అజాద





విదేశీయులు భారతీయుల్ని చిన్నచూపు చూస్తారని బాధపడ్డాడు సుధాకర్. కారణం మన దేశంలోని దరిద్రం అట! ఆ మాట అతను ఒప్పుకోడు.

లక్షల రూపాయలు వెచ్చించి చదివిస్తే, మన దేశాన్ని వదలి వే రొకరికి ఉపయోగపడటం దరిద్రం కాక మ రేమిటి?

రెండు రోజులుగా నేను ఆఫీస్‌కు పోవటం లేదు. అందుకు కారణం మా సుధ.

'సుధ' అంటే ఆడపిల్ల కాదు. సుధాకర్‌ను మేం 'సుధ' అనే పిలుస్తాం. తను మాకు దూరపు బంధువు. అంతకు మించి మా నడుమ స్నేహమే ప్రధాన మనుకుంటాను. నా కంటే తను ఓ సంవత్సరం చిన్నవాడు. నాకంటే బాగా చదివాడు కూడా. అందుకే విదేశాలకు వెళ్ళగలిగాడు.

నేను మాత్రం ఓ ప్రైవేట్ కంపెనీలో గుమాస్తాగా చేరిపోయాను. నేను గోడౌన్ ఇన్‌ఛార్జిని కూడా. ఊరవతల మా గోడౌ న్లున్నాయి. అక్కడ ఎప్పుడూ పని ఉండదు. సీజన్‌లో మూడు నెలలు మాత్రం రాత్రీ, పగలూ పను లుంటాయి.

సుధ విదేశాల నుంచి ఈమధ్యే వచ్చాడు. త్వరలో తిరిగి వెళ్ళిపోత డు. తను ఎంత ఎదిగినా నాకంటే చిన్నవాడిలాగే కనిపిస్తాడు. తను చదువును మించి మరే విషయం ఆలోచించేవాడు కాదు. నేనే వెళ్ళి సుధను పలకరించి వద్దా మనుకున్నాను. కొంచెంసేపు ఆలోచించాను. అంతలోనే నా అంతట నేను వెళ్తే మరోరకంగా అర్థం చేసుకోగలడేమో నని.

ఇలాంటి ఆలోచనల్ని పక్కన బెట్టి నేను

వెళ్ళగలిగానంటే అందుకు కారణం నేను సుధను చూడటమే కాదు. త నున్న చోట జీవన విధానం ఎలా ఉందో తెలుసుకోవా లనుకోవటం కూడా!

ఎటూ మాకు పనుల సీజన్ కాదు కాబట్టి సెలవు సులభంగానే దొరికింది. నేను వెళ్ళేటప్పటికి తను ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అంతకు ముందు సంవత్సరంలో ఓసారి వచ్చి వివాహం చేసుకున్నాడు. తనని అప్పట్లో కలుసుకోవటం నాకు కుదరలేదు.

"జ స్టె మినిట్" అంటూ పలకరింపుగా నవ్వాడు.

నేను నవ్వి కూర్చున్నాను.

పది నిముషాల తరువాత... "మనం అలా పొలాల కేసి నడుద్దామా?" అన్నాడు.

"సంతోషంగా" అన్నాను.

ఇద్దరం కలసి బయలుదేరాం.

"ఇప్పుడు చెప్పు!" అన్నాడు నవ్వుతూ.

"నేనేం చెబుతను? నువ్వు చెబితే వింటానికి వచ్చాను" అన్నాను.

"నేనా? అయామ్ ఆల్‌రైట్" అన్నాడు సుధ.

"నేను ను వ్వుంటున్న దేశం గురించి తెలుసుకోవా లనుకుంటున్నాను" అన్నాను.

త నో నిముషం నిశ్శబ్దంగా ఉండిపోయాడు. "ఏం చెప్పమంటావ్?" అని నాకేసి తిరిగాడు.

"అదే అక్కడి ప్రజల గురించి... వారి అలవాట్ల గురించి... భారతీయుల్ని వా రెలా ట్రీట్ చేస్తా రనేది...

సుధ ఎందుకో నవ్వాడు - "ఏం చెప్ప మంటావ్? మన ఇండియన్స్ అంటే వాళ్ళకి చాలా చిన్న చూపు. మనకి కల్చర్ లేదనీ, మనకి తిండి లేదనీ, భారతదేశ మంత దరిద్రమేననీ... నా కప్పుడు అనిపిస్తుంటుంది. నా దగ్గ రేమైనా రివాల్వర్ ఉంటే కాల్చేయాలని..."

"వా ళ్ళన్నారని బాధపడట మెందుకు? మన దేశంలో దరిద్రం ఉంది కదా?" అన్నాను.

"ఎక్క డుంది దరిద్రం? రమ్మను. మా ఊళ్ళో పని చేయటానికి మనుషులు దొరకటం లేదు. ఇలాంటి ఊర్లు ఈ దేశంలో చాలా చాలా ఉన్నాయి. మన వాళ్ళకి పని చేయటానికి ఇష్టం లేదు అంతే. అయినా వాళ్ళు మనల్ని అంత హీనంగా చూట్టం ఏమిటి? అరె బాబా, ఆ దేశంలో ఏముంది? డబ్బు... డ బ్బుంది. అంతేగా? అరటికాయల దగ్గర్నుంచి అన్నీ ఎక్కడో చోటనుంచి దిగుమతి చేసుకోవాలి. మరి ఇండియా ఇప్పుడు ఎలా ఉంది? మనం ఎంత ముందుకు పోయాం! మనకీ వీ.సీ. ఆర్స్. వచ్చాయి. కంప్యూటర్స్ వచ్చాయి. అయినా ఇండియాలో దరిద్రం ఉంది. వాళ్ళకి ఐస్ క్రీమ్ గురించి కూడా తెలియదు అంటే..." అంటూ బాధపడ్డాడు.

మనం ఎంత ముందుకు పోయామో నాకు తెలియదు కానీ, సుధ చెబుతున్న మాటల ప్రకారం నాకు అర్థమైన విషయాలు ఇవి.

ఈ దేశంలో బట్ట లుతుక్కునే యంత్రాల నుంచి విమానాల దాకా డ బ్బుంటే ఏమైనా కొనుక్కోవచ్చు. కనీసం వస్తువులు దొరుకుతాయి. కానీ అక్కడ డబ్బు పోసినా చాలా వస్తువులు దొరకవు. అలాంటి చోట తమను అవమానించటం ఏమిటంటాడు!

నే నయితే ఈ విషయం మీద చర్చించలేదు గానీ, నాకు ఒకటి అనిపించింది. సుధ లాంటి వా రందరూ కడుపు చేత పట్టుకొని అక్కడ బతకటం కోసం వెళ్ళటం దరిద్రం కాక మరేమిటి?

ఇన్ని లక్షల రూపాయలు తాము తయారు కావటానికి ఖర్చు చేస్తున్న దేశాన్ని వదిలి, వేరొకరికి ఉపయోగపడటం దారిద్రం కాక ఇంకేమిటి?

సుధ బాధని నేను అర్థం చేసుకోగలను. ఈ దేశంలోనూ సంపద లున్నాయి. స్టార్ హోట ళ్ళున్నాయి. మేడల మీద ఈత కొలను లున్నాయి. తమ దారిద్రాన్ని మాత్రమే చూసే అక్కడి వారు వీటిని ఎందుకు చూడరు అనేది తన పాయింటై ఉంటుంది.

ఈ అంశాన్ని సుధ కోణంలో నుంచి ఆలోచిస్తే నేను పూర్తిగా అర్థం చేసుకోగలనేమో! ఏమైనా తనలో పూర్తి మార్పు వచ్చింది. ఇంతకు ముందు ఏ విషయాన్నీ పట్టించుకోని తను ఇప్పుడు తన దేశం గురించి ఆవేదన చెందుతున్నాడు. గొప్ప విషయమే కదా!

నేను సుధ దగ్గర సెలవు తీసుకొని వచ్చేశాను.

మా గోడౌన్లు ఊరికి దూరంగా ఉన్నాయని చెప్పాను కదా! అందుకే అక్కడ మాకు కాలక్షేపం ఉండదు. నాతో పాటు ఓ అటెండర్ ఉంటాడు. అతనే వాచ్‌మన్‌గా కూడా వ్యవహరిస్తుంటాడు. మాకు దగ్గర్లో ఓ చిన్న టీ స్టాల్ ఉంది. అక్కడే సిగరెట్లు కూడా దొరుకుతుంటాయి.

అలాగే రోడ్డు పక్కన ఎవరో ఓ ఇల్లు కట్టుకున్నారు. అక్క డో అమ్మా యుంది. వా రందరూ మా దగ్గరకు నీళ్ళకోసం వస్తుంటారు. అదే మాకు కాలక్షేపం. దానికి తోడు మా రాంబాబు అందరి దగ్గరకీ వెళ్ళి ఆ విషయాలన్నీ కనుక్కొని వస్తుంటాడు. అలాంటి వన్నీ కథలు కథలుగా వివరిస్తుంటాడు.

ఈ కథ లన్నింటికీ జన్మస్థానం ఐ.పి. ఆస్పత్రి. మాకు దగ్గర్లోనే ఉంది. నిజంగా ఆస్పత్రి పే రేమిటో నాకు తెలియదు. అది గవర్నమెంట్‌కు చెందినదే. అయితే ఇక్కడకు తీసుకొచ్చే రోగులు మాత్రం బతికి బయటపడతా రనే నమ్మకం చాలా తక్కువ. అందుకే జనంలో 'ఐ.పి.' ఆస్పత్రి అనే పేరు వచ్చిం దనుకుంటాను.

చాలా తమాషా కేసు లొస్తుంటాయి. బహుశా ఎక్కువ అంటు వ్యాధులు వచ్చిన వారినీ, కలరా లాంటి వ్యాధులకు గురైన వారినీ ఇక్కడకు తరలిస్తా రనుకుంటాను. నా పరీక్షలో ఇంకో అంశం కూడా వెల్లడైంది. ఈ ఆస్పత్రికి వచ్చే వారిలో అనేకమంది, అంటే దాదాపు తొంభై శాతం పైగా నిరుపేదలు. దిక్కులేనివారు. చాలామంది శవాల్ని మునిసిపాలిటీ వారే దహనం చేయాల్సిన పరిస్థితి.

నాకు ఆ ప్రాంతాలకు వెళ్ళాలంటేనే భయం. ఒకసారి మాత్రం వెళ్ళాను. ఆ ఆస్పత్రి ముందు వాతావరణం బాగానే ఉంది. చక్కగా పెరిగిన చెట్లు, ఇతర వాతావరణం కూడా పర్వాలేదు. బహుశా ఊరికి దూరంగా ఈ ఆస్పత్రి నిర్మాణం వెనక ఉద్దేశం రోగులకు మంచి వాతావరణాన్ని అందించటమే కాక, అంటు వ్యాధుల నుంచి జనానికి రక్షణ కల్పించటం కూడా అయి ఉంటుంది. అయితే పరిస్థితులు ఎంత వేగంగా మార్పు చెందుతున్నాయంటే... మరో నాలుగు సంవత్సరాల్లో ఈ ప్రాంతమంతా ఇళ్ళు తయారయిపోతాయి.

అప్పు డేం చేస్తారు? ఈ ఆస్పత్రిని ఇంకా దూరంగా తరలిస్తారా? ఏమో!


నే నా మంచాలమీద మరణానికి చేరువలో ఉంటూ, జీవితం కోసం పోరాడుతున్న వ్యక్తుల్ని చూశాను. వారి కళ్ళలో జీవకళ పూర్తిగా నశించి కేవలం మరణానికి ఆహ్వానం పలకటం కోసం పడుకొని ఉన్నారేమో అనిపించింది.

అక్కడ ఎలాంటి శబ్దమూ లేదు. అత్యంత నిర్లిప్తంగా, యాంత్రికంగా నర్సులు అటూ ఇటూ తిరుగుతూ కనిపించారు. వారు కూడా ఎక్కువమంది లేరు. మా రాంబాబు మాటల్లో చెప్పాలంటే - "ఇక్కడ పని చేయటానికి ఎవ రొస్తారండి బాబూ? ఇదంతా పనిష్మెంట్ ప్లేస్. ఇక్కడ కొచ్చినా ఎప్పుడు బదిలీ చేయించుకుందామా అని ప్రయత్నం చేస్తుంటారు. అయినా ఇక్క డేముందండీ, పది పైన లిచ్చే వా ళ్ళెరీ? ఏవన్నా ఇస్తే వాళ్ళు తీసుకుంటారు."

అలాంటి చోట ఎంత శ్రద్ధగా పని చేస్తారో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. అయినా కూడా ఒక్కో వ్యక్తి ఈ ఆస్పత్రిలోనే మృత్యువుతో పోరాడి జీవితాన్ని సాధించుకున్నాడని తెలిసిన రోజున నా కెంతో ఆనందం కలిగేది.

నేను ఆ ఆస్పత్రి నుంచి తిరిగి వస్తున్నప్పుడు కూడా అదే నిశ్శబ్దం. భయానకంగా ఉంది. గాలి కూడా పెద్ద శబ్దం చెయ్యలే దక్కడ. అంతకు మించి నేను గమనించింది ఆ రోగి తాలూకు మనుషులు.

వారి స్థితి వర్ణనాతీతం. మృత్యువు ఆ రోగిని



**కరిచింది**

"కరిచిం దంటున్నారు. మంచి కుక్కా? పిచ్చి కుక్కా?"

"కుక్క కాదండీ ..."

"అంత సిగ్గెందు కయ్యా! అయితే మీ ఆవిడా? చెప్పు."

"అవునండీ! కొత్త చెప్పు."

'గీత' [గుంటూరు]

భయపెడుతుందో, లేదో గానీ, ఆ రోగికి చెందిన వారందరినీ మాత్రం బీభత్సానికి గురి చేస్తుంది. వారి కళ్ళలో నీటి చుక్కలు గానీ, రక్తపు చుక్కలు గానీ కనిపించవు. వాటి నెవరో తోడేసిన ట్లుంటాయి. వా రలా ఆస్పత్రి గోడల కావల రోడ్డుమీద నిలబడి శూన్యంలోకి చూస్తుంటారు. ఒక్కోసారి రోడ్డు పక్క చెట్టు కానుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంటారు.

ఇలాంటి సంఘటనలన్నీ చాలా సాధారణంగా జరుగుతున్న ట్లుంటాయి. అక్కడే శవాల్ని భద్రపరిచే గది కూడా ఉంది.

మా రాంబాబుకు ఎంత ధైర్యమంటే తను అక్కడకు కూడా వెళ్ళి చూసొస్తుంటాడు. నేనే కోప్పడుతుంటాను.

"ఎందుకయ్యా అలా చేస్తావు? అసలే అంటు రోగాలు. అంటుకుంటే తరువాత ఇబ్బంది పడాలి."

తను నవ్వేస్తాడు. నేను వెళ్ళగానే తాళం తీసి గదంతా ఊడ్చాక అన్నాడు - "ఆస్పత్రిలోకి వెళ్ళొస్తా!"

"ఏమిటి విషయం?" అన్నాను.

"ఈ రోజు ఉదయం ఓ సీరియస్ కేస్ వచ్చింది..."

"చూసి రావాలా?" అన్నాను.

నిశ్శబ్దంగా నవ్వాడు.

తనకు ఎందుకంత ఆరాటమో నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. ఆ ఆస్పత్రిలో ఎంతమంది పేషెం ట్లున్నారో, ఓ నెలలో ఎంతమంది మరణించారో, ఎంతమందికి నయం అయిందో క్షణాల్లో చెప్పగలడు. చాలామంది కుర్రాళ్ళు కూడా తమ తమ హీరోల సినిమాల గురించిన వివరాలు చెబుతుంటారు. ఇది కూడా అలాంటిదేనా?

ఏమో, ఒక్కోడిది ఒక్కో అభిరుచి. నే నయితే పుస్తకాలు తెచ్చుకుంటున్నాను కాబట్టి నాకు కాలక్షేపం అయిపోతుంది. మరి రాంబాబుకు?

"సరే వెళ్ళు. నేను వద్దంటే మానుకుంటావా?" అన్నాను.

"ఇప్పుడే వస్తా సార్!" అంటూ పరిగెత్తాడు. ఓ అరగంట తరువాత తిరిగి వచ్చి చెప్పాడు. "చాలా సీరియస్ కేస్. బతికేదాకా నమ్మకం లేదు. మహా అయితే ఓ పూట బతుకుతా డనుకుంటా. అతని భార్యా, ఓ పిల్ల కూడా వచ్చారు. ఆ అమ్మాయికి అయిదు సంవత్సరా లుంటాయి. పాపం!" అన్నాడు.

నా కిక పుస్తకం చదవా లనిపించలేదు. ఓ రకంగా ఇక్కడ పని చేయటం నాకు ఇష్టం లేదు కూడా. రోజూ ఏదో ఒక మరణం గురించి వినాలి. మరణం సృష్టించే బీభత్సం కన్నా మరణం తరువాత నా కళ్ళముందు కనిపించే జీవచ్ఛవాలు నన్ను మరీ కదిలిస్తున్నాయి.

ఈ రోగా లేమిటి? అందులోనూ ఈ ఆస్పత్రికి వచ్చే కొన్ని కేసుల్లో రోగాల్ని గుర్తించే లోపే ఈ ప్రపంచాన్ని విడిచిపోవటం... ఏది ఏమైనా నా వరకే ఓ విషయం అర్థం అవుతూంది. నేను వచ్చిన కొత్తలో 'మరణం' గురించి విన్నప్పుడు

**అది తప్పు**

శేఖర్: ఈ హోటల్లో ఏవి వెగటుగా ఉంటాయి?
సర్వర్: బిల్లు సార్!
శేఖర్: అయితే అది తప్ప మిగతా ఐటమ్స్ అన్నీ పట్రా!

రెడ్డి శివనాగేశ్వరరావు [మాచర్ల]

నేను నాలో నేను కుంచించుకుపోయేవాడిని. ఎందుకో తెలీని భయం నన్ను ఊపేసేది. రాను రానూ ఈ మరణ వార్తలు న న్నంతగా కదిలించటం లేదు.

ఇక్కడకు వచ్చిన వారిలో ఎవరైనా జీవంతో తిరిగి వెళ్తే... అ దో అద్భుత విషయం మాకు. నేను ఇలానే ఉంటే ఇంకా రొటీన్‌గా, శవాల గది అటెండెంట్‌లా మారిపోత నేమో అనే భయం పీడిస్తోంది. ఈ దేశంలో దరిద్రమే ఉందో, సంపదలే ఉన్నాయో, ఉంటే అవన్నీ పోయాయో ఈ ఆస్పత్రికి మించిన సాక్ష్యం వేరే అవసరం లేదు.

పన్నెండు గంట లవుతుండగా రాంబాబు పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు - "అయిపోయాడు."

నా కిక అక్కడ కూర్చోవా లనిపించలేదు. "రాంబాబూ! నేను ఇంటికి వెళ్ళొస్తాను" అని చెప్పి సైకిల్ తీసుకొని బయటి కొచ్చాను.

ఐ. పి. ఆస్పత్రి మీదుగా వచ్చిన ఓ గాలి తెమ్మెర నన్ను తాకింది. ఒక్కసారిగా నా శరీరం జలదరించింది. నా కెటు చూస్తే అటు రోగాలూ, దరిద్రమూ, దైన్యమూ ఇవే కనిపిస్తున్నాయి. చాలా విషాదకరమైన పరిస్థితి!

నేను సైకిల్ తొక్కుతూ వెళ్తున్నాను. ఎలా ఇంటికి చేరానో నాకు తెలియదు.

"భోజనానికి లేవండి" అంది నా శ్రీమతి.

నాకు భోజనం చేయా లనిపించలేదు. అదే చెప్పాను.

"ఎందుకని? ఆరోగ్యం బాగుండలేదా?" అంటూ నా నుదుటిమీద చెయ్యి వేసింది.

ఆ చేతిని అలానే బలవంతంగా నొక్కి ఉంచాను. నా కెందుకో ఆ ఆస్పత్రీ, అక్కడకు వచ్చే రోగులూ, వారి తాలూకు మనుషులూ గుర్తొచ్చారు. రేపు నా కేదైనా జరిగితే... వీళ్ళూ ఇంతేనా? ఆ గది గోడల బయట విలపిస్తూ... భవిష్యత్ తలచుకొని క్రుంగిపోతనూ..

"ఏమి టలా ఉన్నారు?" అంది.

"ఏం లేదు... ఏం లేదు... పిల్లలు బడి కెళ్ళారా?" అన్నాను.

"వెళ్ళారు" అంది.

"కొద్దిగా కాఫీ" అన్నాను.

కాఫీ తాగా ననిపించాను. నా కెందుకో ఇంటి దగ్గరా ఉండా లనిపించలేదు. తిరిగి సైకిల్ తీసుకొని బయలుదేరాను. నా శరీరంలో ఓ రకమైన వణుకు. ఒకటి మాత్రం వాస్తవం. ఈ ప్రపంచాని కేదో జరగబోతూంది. నేను వచ్చి కుర్చీలో కూర్చున్నాక రాంబాబు కేసి చూశాను.

త నేదో చెప్పా లనుకుంటున్నట్లున్నాడు.

"ఏమిటయ్యా?" అన్నాను.

"మీరు చూశారా?" అన్నాడు.

"ఏమిటి?" అన్నాను అర్థంకాక.

"రోడ్డు పక్కన ఇందాక చచ్చిపోయి నతని శవం ఉంది."

"రోడ్డు మీద ఎందుకు పడేశారు?" కంగారుగా అన్నాను.

"పడెయ్యలేదు. ఆ శవాన్ని అతని భార్య కిచ్చారు. శవం తీసుకు వెళ్ళటానికి డబ్బులు లేవు. అందుకని ఆ అమ్మాయి శవాన్ని పెట్టుకొని డబ్బు లడుక్కుంటోంది."

భళ్ళున వాంతి అవుతుందా అనిపించింది. "ఒరేయ్ సుధా! ఒక్కసారి... ఒక్కసారి ఇటొచ్చి చూడు" అని అరవా లనిపించింది.

చాలాసేపు మా ఇద్దరి నడుమా నిశ్శబ్దం. నేను రాంబాబు కేసి చూశాను. అత నేమాలోచిస్తున్నాడో నాకు తెలియదు. జేబులో నుంచి పది రూపాయల కాగితం అందించి చెప్పాను.

"వెళ్ళు. ఆ అమ్మాయి కిచ్చిరా!"

రాంబాబు లేచి వెళ్ళాడు.

నా కెందుకో అక్కడకు వెళ్ళా లనిపించలేదు. ఆ దృశ్యాన్ని ఈ స్థితిలో చూడగలిగే ధైర్యం నాకు లేదు.

ఈ దేశంలో ఏలాంటి మార్పు లొచ్చినా, భర్త శవాన్ని సైతం భిక్ష మెత్తుకోవటానికి వినియోగించాల్సిన దౌర్భాగ్య స్థితికి జవాబు చెప్పుకోవాలి.

ఎవరు? ఎవరు చెప్పుకోవాలి?

ఆలోచనలు... ఆలోచనలు.

నా తల పగిలిపోతుందేమో అనిపిస్తోంది.

రాంబాబు అటూ ఇటూ తిరుగుతున్నాడు. మధ్యలో ఏవేవో చెబుతున్నాడు.

సాయంకాలం అయిదు గంటలకు నేను బయలుదేరుదా మనుకుంటుండగా రాంబాబు హడావిడిగా వచ్చాడు. "సార్... సార్... రోడ్డు పక్కన శవ ముంది."

తనేం చెబుతున్నాడో అర్థం కాలేదు. "శవ ముండట మేమిటి? ఇంకా అలానే ఉందా?"

"అది కాదండీ... అతని భార్యా, పిల్లా కనిపించటం లేదు."

"పక్కన ఉండి ఉంటారేమో!" అన్నాను.

"లేదు సార్... బస్సెక్కి వెళ్ళిపోయిం దంటున్నారు."

"మరి?" అన్నాను అర్థంకాక.

"ఆ శవాన్ని తీసుకెళ్ళి ఆమె ఏం చేసుకుంటుంది సార్? వచ్చిన డబ్బుతో తమ ఊరికి వెళ్ళిపోయి ఉంటారు." రాంబాబు చెబుతున్నాడు.

ఈ ప్రపంచం నిర్మించుకున్న ప్రేమ, పెళ్ళి, కుటుంబం పునాదులన్నీ కదిలిపోతున్న ట్లనిపించింది. దరిద్రం అన్ని విలువల్నీ ధ్వంసం చేస్తుంది.

నేను వెళ్తూ రోడ్డు పక్కకు చూశాను.

అవును అక్క డో శవం.

ఈ స్థితికి ఎవరు జవాబు చెప్పాలి?

నేను... సుధ... మీరు...

మన మందరం! ★